# సామాన్యులకు కూరగాయాలు

**మార్కెట్లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి.** వానాకాలంలో ఎండలకు దీటుగా వాటి ధరలు సైతం సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. రూ.500 వెచ్చిస్తే కానీ ఇంటికి సరిపడా కూరగాయలు రావడం లేదంటే అతిశయోక్తి లేదు. ఆకుకూరలు, కాయగూరలు ఏవి ముట్టుకున్నా రూ.100వరకు కిలో చొప్పున పలుకుతున్నాయి. దీంతో మధ్య తరగతి కుటుంబాలైతే తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వస్తున్నది. బెండకాయ, వంకాయ, దొండకాయలతో మొదలుపెడితే మెంతి, పాలకూర, తోటకూర ఇలా ఏ రకమైన కూరగాయలైనా కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు చూపులేనితనం, వారి వైఫల్యాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. యాసంగి సీజన్ నుంచి పంట పొలాలకు సాగునీటి కొరతతో కూరగాయల సాగు భారీగా తగ్గింది. ప్రభుత్వాల ప్రోత్సాహం లేకపోవడం.. ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్‌కు సరిపడా కూరగాయలు ప్రజల అవసరాలను తీర్చడం లేదు. దీంతో మార్కెట్లో ప్రజల అవసరాన్ని గుర్తించిన మధ్యవర్తులు రంగంలోకి దిగి హెచ్చు ధరలతో అమ్ముతున్నారు. రైతులకు అరకొర లాభాలే వస్తున్నప్పటికీ దళారులు భారీగా ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు.

నిజామాబాద్, జూన్ 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి)


- మార్కెట్లో అమాంతం పెరిగిన ధరలు
- సతమతం అవుతున్న జనం
- రైతులకు నష్టాలు, దళారులకే లాభాలు
- కుదేలవుతున్న మధ్యతరగతి కుటుంబాలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలే కారణం

### రూ.100కు చేరిన పచ్చి మిర్చి...

పచ్చిమిర్చి ధర రూ.100కు చేరింది. కోయక ముందే కండ్లవెంట మంట తెప్పిస్తున్నది. టమాట సైతం వందకు చేరువైంది. మార్కెట్లో కిలోకు రూ.80 వసూలు చేస్తున్నారు. నిన్నా మొన్నటి వరకు రూ.25కే కిలో ఉల్లిగడ్డలు లభించాయి. ఇప్పుడు ఏకంగా రూ.42కు చేరింది. దొండకాయ, వంకాయలు కిలోకు రూ.50, గోబిగడ్డ ఒక్కటి రూ.35 నుంచి రూ.50 వరకు లభిస్తున్నది. బెండకాయలు రూ.65, క్యాప్సికం కిలోకు రూ.100 పలుకుతున్నాయి. సోరకాయ ధర చిన్న సైజు ధర రూ.30 నుంచి రూ.40 తక్కువకు రావడం లేదు. గోరు చిక్కుడు కిలోకు రూ.80, మునక్కాడలు కట్ట(నాలుగింటికి) రూ.30 చొప్పున ధర పలుకుతున్నది. ఆకుకూరలకు సైతం అదే స్థాయిలో ధరలుంటున్నాయి. ఒకప్పుడు రూ.100తీసుకెళ్తే వారం రోజులకు సరిపడా కూరగాయలు ఇంటికి తీసుకెళ్లేది. ఇప్పుడు అది ఉట్టి మాటగానే మిగిలిపోయింది. జేబులో రూ.500 లేకపోతే ఇంటికి నాలుగైదు రోజులకు సరిపడా కూరగాయలు తీసుకెళ్లడం గగనమైంది. వారం రోజుల క్రితం వరకు కూరగాయల ధరల్లో కాసింత తగ్గుదల కనిపించింది. కానిప్పుడు అకస్మాత్తుగా ధరల్లో వ్యత్యాసం కనిపిస్తున్నది. ఒక్కసారిగా పెరిగిన ధరలతో ఏం కొనేటట్టు లేదు... ఏం తినేటట్టు లేదంటూ ప్రజలంతా నిట్టూర్చాల్సి వస్తున్నది.

### మధ్యవర్తులకే లాభాలు...

ఆరుగాలం శ్రమించి కూరగాయలు సాగు చేసిన రైతులకు లాభాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. అరకొర ధరలకే దళారులకు కూరగాయలను విక్రయిస్తున్నారు. మార్కెట్‌కు చేరిన వాటి ధరలు ఒక్కసారిగా 40 నుంచి 50 శాతం పెరుగుదలతో రిటైల్ కూరగాయల వ్యాపారుల చేతికి వస్తున్నాయి. వారి నుంచి విక్రయానికి గురవుతున్న కూరగాయలు ఒక్కసారిగా హెచ్చు ధరలతో ప్రజల ముంగిట కనిపిస్తుండడంతో ఊహించని భారం పడుతున్నది. ఓ వైపు ద్రవ్యోల్బణం ప్రభావం మూలంగా ఈ పరిస్థితిలో మార్పు నెలకొన్నది. అనుకూలించని వాతావరణంతోపాటు సాగుకు రాష్ట్రంలో ప్రోత్సాహం కరువైంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ సాగునీటికి గోస ఏర్పడింది. దీంతో బోరు బావులున్న ప్రాంతాల్లో కూరగాయల సాగు జరుగుతున్నప్పటికీ ఎదురవుతున్న ఇక్కట్లతో కూరగాయల సాగు ముళ్లబాటగా మారింది. దీంతో ఉత్పత్తి గణనీయంగా తగ్గడంతోనూ ఈ దుస్థితి నెలకొన్నట్లుగా పరిశీలకులు చెబుతున్నారు. ఉద్యానవన శాఖ అధికారులు కేవలం ఉత్సవ విగ్రహాల మాదిరిగా తయారయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదర్శ రైతులను కూరగాయల సాగు వైపు ప్రోత్సహించడంలో వైఫల్యం చెందుతున్నారు. తద్వారా మార్కెట్లో డిమాండ్‌కు సరిపడా కూరగాయలు అందుబాటులో లేకుండా పోయాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే సామాన్యుల జీవితాలు విలవిల్లాడడం ఖాయంగా కనిపిస్తున్నది.



### ధరలు మండిపోతున్నాయి..



కోటగిరి, జూన్ 18: అంగట్లో కూరగాయల ధరలు చాలా పెరిగాయి. మొన్నటి వరకు కిలో టమాట రూ.10–20 ఉంటే ఈరోజు ఒక్కసారిగా కిలో రూ.60 నుంచి 80 పలుకుతున్నది. కిలో పచ్చిమిర్చి రూ.120 పలుకుతున్నది. చివరికి తోచింది తీసుకెళ్తున్నా. పెరిగిన ధరలను చూసి పప్పులు తింటున్నాం. ఇప్పుడే ఇలా ఉంటే రాబోవు రోజుల్లో ఇంకా ఎంత పెరుగుతాయోననే భయంగా ఉన్నది.

**- అనూషాబాయి, జల్లాపల్లి అబాది, ఉమ్మడి కోటగిరి మండలం**

### రూ.500 తీసుకెళ్తే సంచి నిండడం లేదు..



కూరగాయల కోసం రూ.500లు తీసుకెళ్తే చిన్న సంచి కూడా నిండడం లేదు. ఏ వంట చేసినా టమాట వేయడం తప్పనిసరి. మొన్నటి వరకు తక్కువగా ఉండగా ఇప్పుడు ఏకంగా రూ.60–80కి పెరిగింది. వారానికి రెండు మూడు కిలోలు కొనేవాళ్లం. ఇప్పుడు పావు కిలో తీసుకెళ్తున్నాం. వంటలో కూడా వేయడం లేదు. ధరలు పెరిగితే ఏం కొనలేం.. ఏం తినలేం..

**-జయమ్మ, ఎత్తొండ, కోటగిరి మండలం**

### ఏమీ కొనలేని పరిస్థితి..



అంగట్లో కూరగాయల ధరలు బాగా పెరిగాయి. మొన్నటి వరకు టమాట కిలో రూ.20–40 ఉండగా ఇప్పుడు రూ.60–80 పలుకుతుంది. రూ.500 తీసుకొని అంగడికి పోతే సంచి నిండా కూరగాయలు వచ్చేవి. ఇప్పుడు అదే 500 తీసుకొస్తే ఏం వస్తలేవు. నాలుగు రకాల కూరగాయలు మాత్రమే కొంటున్నాం. పచ్చిమిర్చి కిలో రూ.120 అయ్యింది. ప్రతి కూరగాయ ధర వందకు పైగా పెరిగింది. కిలోల చొప్పున కొనుగోలు చేసేవారు కూడా పావుకిలో, అర కిలోతో సరిపెట్టుకోవాల్సి వస్తున్నది.

**- లక్ష్మీబాయి, కోటగిరి**

## జీజీహెచ్‌లో 'యూరాలజీ' సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్

ఖలీల్‌వాడి, జూన్ 18 : జీజీహెచ్‌లో ఇటీవల న్యూరో సర్జరీ సేవలు ప్రారంభించామని, ఇప్పుడు సూపర్ స్పెషాలిటీ తరహాలో యూరాలజీ సేవలను అందిస్తున్నామని సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ అన్నారు. మంగళవారం ఆమె జీజీహెచ్‌లో మీడియాతో మాట్లాడారు. జీజీహెచ్‌లోని యూరాలజీ విభాగానికి చెందిన డాక్టర్ శబరినాథ్ శస్త్రచికిత్సలను చేస్తున్నారని తెలిపారు. ఈ వారంలో షైక్ జాని, రవి అనే ఇద్దరి మూత్రాశయంలో ఉన్న రాళ్లను శస్త్రచికిత్స ద్వారా తొలగించినట్లు పేర్కొన్నారు. జిల్లాకు చెందిన ఎవరైనా మూత్రాశయంలో రాళ్లతో ఇబ్బంది పడితే వెంటనే జీజీహెచ్‌లో సంప్రదించాలని సూచించారు.

శస్త్ర చికిత్స చేయించుకున్న ఇద్దరు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాము ప్రైవేట్ దవాఖానకు వెళ్తే సుమారు లక్ష రూపాయలు ఖర్చయ్యేవని తెలిపారు. తమకు జీజీహెచ్‌లో శస్త్రచికిత్స ఉచితంగా చేసిన వైద్యులకు ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.

## ప్రాణం తీసిన పగ

### పాతకక్షలతో మహిళ దారుణహత్య



రాగుల లక్ష్మి (ఫైల్)

కామారెడ్డి రూరల్ , జూన్ 18 : ఇంట్లో గొడవలతో తండ్రిని చితకబాదుతున్న ఓ వ్యక్తి.. ఎదురుగా కనిపించిన ఓ మహిళపై దాడికి పాల్పడ్డాడు. పాత కక్షలను మనస్సులో పెట్టుకుని ఆమెను దారుణంగా హతమార్చాడు. కామారెడ్డి జిల్లా తిమ్మక్‌పల్లి గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దేవునిపల్లి ఎస్సై రాజు, బాధితుల కథనం ప్రకారం.. తిమ్మక్‌పల్లిలో రాగుల లక్ష్మి (80), రాగుల రాజశేఖర్ కుటుంబాలు పక్కపక్కనే నివాసముంటున్నాయి. రెండు కుటుంబాల మధ్య గతంలో గొడవలు జరిగాయి. అయితే, సోమవారం సాయంత్రం తన తండ్రితో గొడవ పడిన రాజశేఖర్ ఆయనను చితకబాదుతూ బయటికి లాక్కొచ్చాడు. అదే సమయంలో రోడ్డు మీదుగా వెళ్తున్న లక్ష్మి కనిపించడంతో తండ్రిని వదిలిపెట్టిన రాజశేఖర్ ఆమెపై దాడికి దిగాడు. ఇటుక పెల్లలతో తలపై, చెవిపై బలంగా కొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ఆమెతో ఉన్న మనువడిపైనా దాడికి పాల్పడ్డాడు. ఇది గమనించిన స్థానికులు లక్ష్మిని హుటాహుటిన కామారెడ్డి ఏరియా దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ఆమె మృతి చెందింది. తన తల్లిపై దాడి చేసి చంపిన రాజశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని మృతురాలి కుమారుడు పెద్ద నర్సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## కేసు నుంచి తప్పించుకునేందుకు గొంతుకోశారు

- వ్యక్తిపై రాత్రివేళ కత్తులతో దాడి
- గొంతు, మర్మాంగాలపై కత్తిపోట్లు

నాగిరెడ్డిపేట, జూన్ 18: బహిర్భూమికి వెళ్లిన వ్యక్తిపై కత్తులతో దాడి చేసి గొంతు, మర్మాంగాలపై కత్తిపోట్లు వేసి హత్యచేసేందుకు యత్నించిన ఘటన నాగిరెడ్డిపేట మండలం రాఘవపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన నార్ల నాగయ్య(55)ను గుర్తు తెలియని వ్యక్తులు రాత్రివేళ కత్తులతో దాడిచేసి గాయపర్చారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న నాగయ్యను చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఘటనపై ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నాగయ్య రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బహిర్భూమికి వెళ్లాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఆయనపై కత్తులతో దాడిచేసి గొంతు కోసి గాయపరిచారు. అదే సమయంలో ద్విచక్రవాహనంపై వ్యవసాయ బోరువద్దకు వెళ్లి వస్తున్న నాగయ్య బావమరిది నార్ల సంగయ్య, పోచయ్యకు దారిపక్కన రక్తపుమడుగులో నాగయ్య కనిపించాడు. గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు చేరుకొని దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతున్న నాగయ్యను విచారించగా.. రెండేండ్ల క్రితం మానసిక వికలాంగురాలైన తన కూతురుపై లైంగిక దాడి చేసి, జైలుకు వెళ్లివచ్చిన జూకంటి రమేశ్, పుట్టి శ్యామ్‌తోపాటు జూకంటి సాయిలు తనపై కత్తితో దాడి చేసినట్లు చెప్పారు. నాగయ్య బావమరిది సంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. ఘటనా స్థలాన్ని మంగళవారం క్లూస్‌టీం పరిశీలించి ఆధారాలను సేకరించారు. హత్యాయత్నంపై పలు అనుమానాలు ఉండడంతో పోలీసులు గ్రామస్తులను విచారిస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండేండ్ల క్రితం నాగయ్య కూతురిపై లైంగిక దాడి కేసులో గ్రామానికి చెందిన నలుగురు జైలుకు వెళ్లారు. మరికొద్ది రోజుల్లో కేసు హియరింగ్‌కు వస్తుందని తెలిసి అడ్డుగా ఉన్న నాగయ్యను చంపితే కేసును అడిగేవారు ఉండరనే ఆలోచనతోనే హత్య చేసేందుకు కుట్రపన్నారని గ్రామస్తులు తెలిపారు. విచారణ చేపడుతున్నామని, వాస్తవాలు వెల్లడిస్తామని పోలీసులు చెబుతున్నారు.

## యువకుడిపై కత్తితో దాడి

లింగంపేట, జూన్ 18: కుటుంబ కలహాలతో యువకుడిపై కత్తితో దాడి చేసిన ఘటన మండలంలోని మెంగారం గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. ఏఎస్సై ప్రకాశ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బోనాల్ గ్రామానికి చెందిన నీల స్వామికి ఎక్కపల్లి గ్రామానికి చెందిన సునీతతో వివాహం జరిగింది. కుటుంబ కలహాలతో సునీత తల్లిగారింట్లో ఉంటున్నది. 10రోజుల క్రితం స్వామి.. తల్లి అల్లెవ్వతోపాటు కోమట్‌పల్లి గ్రామంలో ఉంటున్న సోదరి ఈకల బాలమణి ఇంటికి వెళ్లారు. పండుగ అనంతరం కామారెడ్డి రైల్వేస్టేషన్‌లో స్కావెంజర్‌గా పనిచేస్తున్న అల్లెవ్వ వెళ్లిపోయింది. సోమవారం రాత్రి స్వామి బోనాల్ గ్రామానికి వెళ్తుండగా మెంగారం గ్రామ బస్టాండ్ సమీపంలో ఈకల బాలమణి అల్లుడు నవీన్, బొల్లారం గ్రామానికి చెందిన సుధాకర్ స్వామిపై కత్తితో దాడి చేసి గొంతుకోశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని స్వామిని చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు తెలిపారు. తల్లి అల్లెవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

## పథకాలు అందేదెప్పుడు?



రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న గ్యారెంటీ పథకాలను అర్హులమైన తమకు అందించాలని కోరుతూ ప్రజలు ప్రజాపాలన కేంద్రానికి తరలివస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హంగు ఆర్భాటాలతో ఊరూరా ప్రారంభించిన కేంద్రాల్లో గ్యారెంటీ పథకాలకు దరఖాస్తు చేసుకున్నా ఇప్పటివరకు లబ్ధి చేకూరలేదని ప్రజలు మండిపడుతున్నారు. మొదట వివరాలు తప్పుగా నమోదు చేశామని, తర్వాత ఎన్నికల కోడ్ అంటూ మళ్లీమళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంపై అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఇంకా దరఖాస్తులు స్వీకరిస్తూ అధికారులు కాలం గడిపితే అర్హులైమైన తమకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలు అందేదెప్పుడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుదారులతో సందడి నెలకొన్నది.

– ఆర్మూర్‌టౌన్, జూన్ 18

## కనిపించని నాట్లు



ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ గ్రామపరిధిలోని ఆయకట్టు భూములు బోసిపోయి కనిపిస్తున్నాయి. ఎప్పుడూ ముందుగానే నాట్లు వేసే ఇక్కడి రైతులు.. ఈసారి సరైన వర్షాలు కురవకపోవడంతో ఆలస్యంగా నార్లు పోశారు. గత సంవత్సరం ఇదే సమయంలో నాట్లు పూర్తయి ఆయకట్టు మొత్తం పచ్చని పంటలతో కళకళలాడింది. ప్రస్తుతం వర్షాల కోసం ఇక్కడి రైతులు వేచి చూస్తున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

## పంట కోసం పాట్లు..



**వర్షాభావ పరిస్థితులు** అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వర్షాలు కురుస్తాయనే ఆశతో సాగు మొదలుపెట్టిన రైతులు పంటలను కాపాడుకునేందుకు పాట్లు పడుతున్నారు. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలంలో వారం రోజుల క్రితం కురిసిన వానలతో రైతులు పత్తి, మక్కజొన్న విత్తనాలు వేశారు. విత్తనాలు వేసిన నాటి నుంచి సరైన వర్షాలు లేక ఎండవేడికి మొలక శాతం తగ్గింది. వచ్చిన కాస్త మొలకలు సైతం వాడిపోతున్నాయి. దీంతో పంటను రక్షించుకునేందుకు ఆరెపల్లి గ్రామంలోని ఓ రైతు రేయిన్ డ్రిప్ పైపుల ద్వారా నీటిని అందిస్తున్నాడు. మరో రెండు రోజులు వర్షాలు కురవకపోతే మొలకలు పూర్తిగా ఎండిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

– రాజంపేట్, జూన్ 18